క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఓటర్ల సమావేశం రేపు


మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లో ఉన్న ఎమ్మెల్సీ ఓటర్లకు శుక్రవారం ఉదయం 11 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తన అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరు కానున్నారని తెలిపారు. కావున నాలుగు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వేగం వద్దు.. నిధానమే ముద్దు


ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నీలావతి

రేగిడి: వాహన చోదకులు పరిమితికి మించిన వేగంతో ప్రయాణం చేయరాదని, నిధానంగా గమ్యాన్ని చేరుకోవాలని ఎస్‌ఐ పి.నీలావతి అన్నారు. ఉంగరాడ మెట్ట వద్ద బుధవారం రహదారి భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ప్రైవేట్, ప్రభుత్వ వాహనదారులంతా నిబంధనలు పాటించి, నెమ్మదిగా ప్రయాణాలు చేయాలని కోరారు. అతివేగం ప్రాణాపాయం అని వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హితవుపలికారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు.

సీఆర్‌ఎంటీలు బాధ్యతగా పనిచేయాలి

రేగిడి: క్లస్టర్ల సీఆర్‌ఎంటీలు బాధ్యతగా పనిచేయాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండల రిసోర్సు కార్యాలంలో మండలంలోని సీఆర్‌ఎంటీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అపార్ రిజిస్ట్రేషన్లపై ప్రస్తుతం దృష్టిసారించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల్లో ఈ నెలాఖరులోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసి, వారికి సహకరించాలన్నారు.

లక్ష్యాలు పూర్తిచేయాలి

రాజాం సిటీ: ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఏపీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేతనదారులకు పనులపై అవగాహన కల్పించాలని సూచించారు. అందరికీ పనులు కల్పించడంతో పాటు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం పాల్గొన్నారు.

కలుపు నివారణతో అపరాల్లో అధిక దిగుబడి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్యామ్‌సుందర్

బొబ్బిలి రూరల్: పెసలు, మినుము, కందులు వంటి అపరాల పంటల సాగులో కలుపు నివారణను సక్రమంగా చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయశాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ సూచించారు. మండలంలోని చింతాడ గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొలాల్లోని అపరాల పంటలను పరిశీలించారు. అపరాల సాగులో కలుపు నివారణపై రైతులకు పలు సూచనలు చేశారు. మొక్క మూడు ఆకుల దశలో ఇమేజీతాఫయర్ 250 ఎం.ఎల్ ఎకరాల పొలానికి పిచికారీ చేసినట్లయితే కలుపు సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి రైతులంటే వివక్ష


వేమిరెడ్డి లక్ష్మునాయుడు

బొబ్బిలి: పీఎం గ్యారెంటీ పథకాన్ని రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర కొన్ని రాష్ట్రాలకే పరిమితం చేసి ఏపీతో పాటు మిగతా అన్ని రాష్ట్రాలకూ మొండిచేయి చూపడం చూస్తే రైతులంటే కేంద్ర ప్రభుత్వానికి వివక్ష అని తేటతెల్లమవుతోందని రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెట్టుబడులు ఆకాశాన్నంటుతున్న వేళ తగిన గిట్టుబాటు ధర అందక రైతులు అప్పుల్లో మునిగిపోతున్నారన్నారు. దేశంలోని బడా బాబులు, కార్పొరేట్లకు రుణమాఫీలు చేస్తున్న ప్రభుత్వం రైతుల రుణమాఫీ గూర్చి పట్టించుకోవడం లేదన్నారు. ఈ దశలో పీఎం గ్యారెంటీ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేస్తే గిట్టుబాటు ధరకు 30 శాతం బోనస్ లభిస్తుందని, ఇది రైతులకు ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. కేవలం కొద్దిమందికి మాత్రమే అమలు చేసి మిగతా వారిని వదిలివేయడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు.

విజ్ఞాన వీచికలు.. గ్రంథాలయాలు


రాజాం గ్రంథాలయానికి పుస్తకాలు ఇస్తున్న దాతలు (ఫైల్)

- జ్ఞానబడులుగా కీర్తి..
- నిరుద్యోగ యువతకు గురుకులాలు..
- జ్ఞానాన్ని ప్రసాదించే బాండాగారాలు
- నేటి నుంచి 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు


గ్రంథాలయంలో పుస్తకాలు

రాజాం:

మనిషిని సంస్కారవంతునిగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయాల పాత్ర విశిష్టమైనది. సమూహంలో ఉంటూనే ఏకాంతాన్ని అనుభవించగలిగే అతి సుందర ప్రదేశం గ్రంథాలయం ఒక్కటే. తవ్వేకొగలిగినన్ని జ్ఞాన గనులు గ్రంథాలయంలో ఉంటాయి. ఇక్కడ కూర్చునే ప్రపంచాన్ని చుట్టిరాగలిగే విజ్ఞాన వాహనాలు ఎన్నో ఉంటాయి. అందుకే గ్రంథాలయాలను విజ్ఞాన వీచికలు అని అంటారు. నేటి నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయాలపై ప్రత్యేక కథనం.

వన్నెతగ్గని విజ్ఞాన వీచిక..

మనిషికి పుస్తకాలుతో అవినాభావ సంబంధం ఉంది. సమాచార సాంకేతిక విప్లవం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతూ రెడియో, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్స్ వంటి కొత్త సాధనాలను తీసుకొచ్చినా పుస్తకానికి మాత్రం చెదరని స్థానం అలానే ఉంది. అటువంటి పుస్తకాల నిలయాలే గ్రంథాలయాలు. పుస్తక పఠనం ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. ప్రస్తుతం మారుమూల పల్లెల్లో కూడా గ్రంథాలయాలు విరజిల్లుతున్నాయి. దాతల సాయంతో నడుస్తున్నాయి. పత్రికలు, మ్యాగజైన్‌లు, పుస్తకాలు ఇలా ఎన్నో ఇక్కడ నిక్షిప్తమౌతున్నాయి. వీటి వద్ద కూర్చునిజ్ఞాన సమపార్జన చేసి ఉద్యోగాలు సాధిస్తున్న యువకులు కోకొల్లలుగా ఉన్నారు. ఈ జ్ఞానభాండాగారాలు జ్ఞానాన్ని ప్రసాదించే గురుకులాలుగా విరజిల్లుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జ్ఞానాన్ని తమ గుప్పిట్లో పెట్టుకుని, అక్కడకు వచ్చేవారిని అక్కున చేర్చుకుని, జ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతున్నాయి.

వారోత్సవాల్లో ఏమి చేస్తారు...

జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో ఆదివారం నుంచి వారోత్సవాలు ప్రారంభమౌతున్నాయి. ప్రతీ రోజు పుస్తకాలను పాఠకులకు పరిచయం చేయడం, కొత్తవి తెలియజేయడం, పాఠకులకు, విద్యార్థులకు పోటీలు నిర్వహించడం, విజేతలకు ప్రముఖులతో బహుమతులు అందించడం చేస్తారు. ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా లైబ్రేరియన్‌లు ఉన్న గ్రంథాలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వక్తలతో ప్రసంగాలు నిర్వహించనున్నారు.

తేదీలు వారీగా కార్యక్రమాలు..

ఈనెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న స్వాతంత్ర్యసమరయోధుల జీవిత చరిత్రలతో కూడిన ప్రసంగాలు, 17న కవి సమ్మేళనం, 18న వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు, 19న మహిళా దినోత్సవం, చదవడం మాకిష్టం కార్యక్రమంతో ముగించనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వృక్తత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇలా..

జిల్లాలో మొత్తం గ్రంథాలయాలు	41
గ్రామీణ గ్రంథాలయాలు	03
మొత్తం లైబ్రేరియన్‌లు	41 మంది
రెగ్యులర్ ఉద్యోగులు	20 మంది
ఔట్ సోర్సు ఉద్యోగులు	21 మంది
ప్రైవేట్ గ్రంథాలయాలు	48
జిల్లాలోని ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలు	3,53,690

వాటికి ఎప్పుడూ డిమాండే..

గ్రంథాలయాల్లో కాంపిటేటివ్ పుస్తకాలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా యువకులు కాంపిటేటివ్ పుస్తకాలను తీసుకెళ్తుంటారు. ఇందుకోసం ముందుగా కొంత మొత్తం చెల్లించి సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుంది. పుస్తకం తీసుకెళ్లిన తరువాత నాలుగు రోజులులోగా తిరిగి ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతీ రోజు ప్రతీ గ్రంథాలయంలో కనీసం ఆరు నుంచి ఎనిమిది దినపత్రికలు ఉంటాయి. ప్రస్తుతం గ్రంథాలయాల వినియోగం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది. గ్రంథాలయ వారోత్సవాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాం.

– బి.లక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, విజయనగరం

అన్ని వర్గాలవారూ పాఠకులే..

గ్రంథాలయాలు దేవాలయాలు కంటే గొప్పవి. ఇక్కడ కుల మత, చిన్నా పెద్ద తారతమ్యాలు ఉండవు. అందరికీ సమానంగా జ్ఞానాన్ని, గౌరవాన్ని ఇస్తాయి. వేలాదిమంది పాఠకులు ఈ గ్రంథలయాల ద్వారా జ్ఞానసమపార్జనచేసి, ఉన్నత శిఖరాలకు చేరుకున్నారు. గ్రంథాలయాల్లో చదివి చాలా మంది నిరుద్యోగులు ఉద్యోగాలు సాధించారు.

– గార రంగనాథం, రారవే నిర్వాహకులు, రాజాం

మద్యం దుకాణాన్ని తరలించాలి



బొబ్బిలి: మద్యం దుకాణం ఎదురుగా ధర్నా చేస్తున్న ఐద్వా, ప్రజాసంఘాలు

బొబ్బిలి: పట్టణంలోని మేదరిబంద జంక్షన్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని వెంటనే ఎత్తివేసి వేరేచోటకు తరలించాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు కె.పుణ్యవతి, సీపీఎం బొబ్బిలి, రామభద్రపురం మండల కన్వీనర్లు ఎస్.గోపాలం, బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడి మద్యం షాపు ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జనావాసాల మధ్య మద్యం దుకాణాన్ని ఎలా పెడతారని ప్రశ్నించారు. నిత్యం మహిళలు, చిన్నారులు తిరుగాడే ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టొచ్చా? ఇది నిబంధనలకు వ్యతిరేకం కాదా అని నిలదీశారు. అంతకుముందు దుకాణం ఏర్పాటుకు భవనం అద్దెకు ఇచ్చిన యజమాని ఇంటిముందు కూడా ధర్నా చేశారు. పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆడుకునే మద్యం వ్యాపారానికి భవనం అద్దెకు ఇవ్వవద్దని కోరారు.

మద్యం షాపు తరలింపు

వంగర: మద్దువలస గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం షాపును ఎట్టకేలకు తరలించారు. గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో గ్రామస్తులంతా దాన్ని వ్యతిరేకించారు. మద్యం షాపును తరలించాలని కోరుతూ స్థానిక వైఎస్సార్‌సీపీ నేత బూరాడ వెంకటరావు, మహిళలు పదిరోజులుగా నిరసన తెలియజేశారు. దీనిపై ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి షాపును అరసాడ సమీపంలోకి తరలించారు. దీనిపై మద్దువలస గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యంగా 'ఉల్లాస్'

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా 'ఉల్లాస్' కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల్లో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారికి అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. ఇందుకోసం వెలుగు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులు, సీసీలు, వీఓఏలు, వలంటీర్లకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోని మండల పరిషత్ సమావేశ భవనాల్లో బుధవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఎంపిక చేసిన వలంటీర్లు తమ చుట్టూ ఉన్న నిరక్షరాస్యులకు చదవడం, రాయడం వంటివి నేర్పించాలని సూచించారు. శతశాతం అక్షరాస్యతను సాధించేందుకు కృషిచేయాలన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక, న్యాయ పరమైన అంశాల్లో పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. – సాక్షి నెట్‌వర్క్


బాడంగి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ


బొబ్బిలి రూరల్: శిక్షణ ఇస్తున్న వయోజనవిద్య ఉపసంచాలకులు అల్లు సోమేశ్వరరావు


బొబ్బిలి రూరల్: శిక్షణలో పాల్గొన్న వెలుగు సభ్యులు


తెర్లాం: ఉల్లాస్ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ పాపారావు, పక్కన ఎంపీడీఓ రాంబాబు


రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రత్నం


వంగర: వెలుగు సీసీలు, వీఓఏలు, వలంటీర్లకు సూచనలిస్తున్న ఎంఈఓ వై.దుర్గారావు


రాజాం: వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కనకదుర్గ

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా


అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

రేగిడి: మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నాగావళి నదీ తీరం నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలించి రాజాం, చీపురుపల్లి, విజయనగరం ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తుండటంతో నదీతీర ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విచ్చలవిడిగా ట్రాక్టర్లు వస్తుండడంతో ఆయా ప్రాంతాల్లోని రహదారులు పూర్తిగా గోతులుమయంగా మారుతున్నాయి.

రూ.1000లు వసూలు చేస్తూ..

మండలంలో కె.వెంకటాపురం వద్ద నాగావళి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఇక్కడ అధికారికంగా ఎటువంటి రీచ్ కూడా మంజూరు కాలేదు. ఇక్కడ ట్రాక్టర్‌కు ఇసుక లోడ్ చేసేందుకు రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు బొడ్డవలస వద్ద కూడా ఇదే పరిస్థితి ఉంది.

ఇసుకను సమీప తోటల్లో నిల్వ చేసి రాత్రి సమయాల్లో అక్కడ నుంచి ఇతర మండలాలకు తరలిస్తున్నారు. ఉచిత ఇసుక పంపిణీ అని ప్రభుత్వం చెప్పినా గతంలో కంటే అధికంగా చెల్లించాల్సి వస్తుందని భవన నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ తహసీల్దార్ చిన్నారావు వద్ద సాక్షి ప్రస్తావించగా, ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టామని అన్నారు. నాగావళి నదీతీర ప్రాంతాల్లో గట్లు ట్రెంచ్‌లు కొట్టి అక్రమ రవాణాను అడ్డుకుంటామని తెలిపారు.

రూ.15 లక్షలతో సీసీడ్రైన్‌ల నిర్మాణం

రేగిడి: మండలంలో సంకిలి గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ డ్రైన్‌ల నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో వాటిని నిర్మిస్తున్నామని సర్పంచ్ బుడుమూరు పట్టాభి తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఈ పనులు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉద్దవోలు సర్పంచ్ భర్త మృతి


విజయప్రసాద్(ఫైల్)

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామ సర్పంచ్ ఎచ్చెర్ల సునీత భర్త విజయప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకునిగా, సర్పంచ్ ప్రతినిధిగా గ్రామాభివృద్ధికి ఆయన ఎంతగానో కృషి చేశారు. ఆయన గత కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో విశాఖపట్నంలోని ఆస్పత్రికి చికిత్సకు వెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. బుధవారం ఉద్దవోలులో అంత్యక్రియలు నిర్వహించారు. విజయప్రసాద్ మృతిపట్ల మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తెర్లాం, బాడంగి, రేగిడి: మండలంలోని శాఖాగ్రంథాలయంలో గురువారం నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు, లైబ్రేరియన్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. 14న వారోత్సవాల ప్రారంభం, 15న మాదకద్రవ్యాలపై అవగాహన, పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ, 17న కవి సమ్మేళనం, సెమినార్లు, 18న విద్యార్థులకు పోటీలు, 19న మహిళలకు వివిధ అంశాలపై పోటీలు, 20న చదువంటే నాకిష్టం కార్యక్రమం, వారోత్సవాల ముగింపు, బహుమతుల ప్రధానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, పాఠకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రంలో వసతుల పరిశీలన


బాడంగి హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బాడంగి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కె.సుధాకర్ బుధవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని సౌకర్యాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అవాంతరాలు లేకుండా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం, రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అప్పటి నుంచి డిసెంబరు 9వరకు అభ్యంతరాల స్వీకరించనున్నట్లు చెప్పారు. వాటిని 25 లోగా పరిష్కారించి 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు 37 దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

లింగనిర్ధారణ చట్టం పక్కాగా అమలు చేయాలి: ఆర్డీఓ


సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ జేవీవీఎస్ రామ్మోహనరావు

బొబ్బిలి: లింగనిర్ధారణ పరీక్షల నిరోధక చట్టాన్ని పక్కాగా అమలు చేయడంలో వైద్యులు, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, పోలీసు, రెవెన్యూ శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ జేవీవీఎస్ రామ్మోహనరావు అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో పీడీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికా నిష్పత్తి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్థ శిశు నిర్మూలన, ఆడపిల్లల పట్ల వివక్ష, మూఢనమ్మకాలు వంటి సామాజిక కారణాలేమైనా గమనిస్తే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే బాలికా నిష్పత్తి పెరుగుతుందన్నారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ సంతోషికుమారి, వైద్యులు రోజారాణి, శాంతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రాజ్యలక్ష్మి, దీక్షా మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈఓ లచ్చుపతుల శాంతి, డెమో వి.చిన్నతల్లి, హెల్త్ ఎడ్యుకేటర్ చాముండేశ్వరి, మోనిటరింగ్ కన్సల్టెంట్ ఎ.పవన్ ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థి


సందీప్‌దొరతోపాటు ఇతరక్రీడాకారులు, పీడీ, టీచర్లు

బాడంగి: జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు బాడంగి హైస్కూల్‌కు చెందిన మామిడి సందీప్‌దొర ఎంపికైనట్టు ఆ పాఠశాల పీడీ, కోచ్ బంగారునాయుడు తెలిపారు. డిసెంబర్ నెలలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం తరఫున తలపడతాడని చెప్పారు. ఇటీవల గుంటూరు జిల్లా ఎలమందలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. ఇదే పాఠశాలకు చెందిన సందీప్‌దొర, నంగిరెడ్డిస్వామినాయుడు, తూముల దిలీప్‌తోపాటు, బేస్‌బాల్ పోటీల్లో స్టేట్ తృతీయ స్థానంలో నిలిచిన బాలికల జట్టులో కొయ్యాన జ్యోతి, గుజుపూరు వైదేహి కీలక భూమిక పోషించారన్నారు. వీరిని తీర్చిదిద్దిన పీడీని హెచ్‌ఎం సత్యనారాయణ, సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శర్మ, పీడీ అప్పలనాయుడు

రామభద్రపురం: ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 17 విభాగం స్కూల్ గేమ్స్ పోటీలలో రామభద్రపురం మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించడం గర్వకారణం. అండర్ 17 బాలుర విభాగంలో 10వ తరగతి విద్యార్థి ఎం.ఉమామహేశ్వర రావు, 9వ తరగతి చదువుతున్న ఎ.ప్రేమ్‌సాగగర్ , 8వ తరగతి చదువుతున్న గోగి ధనలక్ష్మి రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో ప్రథమ స్థానం సాధించారని వ్యాయామ ఉపాధ్యాయుడు వి అప్పలనాయుడు తెలిపారు. విజేతలను పాఠశాల హెచ్‌ఎం జీసీహెచ్‌ఎస్ శర్మ, ఉపాధ్యాయులు డి రామారావు, తదితరులు అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


మాట్లాడుతున్న ఫౌండేషన్ సభ్యులు

రాజాం సిటీ: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు బౌద్ధమార్గ్ లైవ్‌లీహుడ్ ఫౌండేషన్ కృషిచేస్తోందని ఫౌండేషన్ మేనేజర్ వరదరాజులు తెలిపారు. పట్టణంలోని కుమ్మరవీధిలో బుధవారం కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు పట్టణాల్లో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే ధ్యేయంగా బౌద్ధమార్గ్ లైవ్‌లీహుడ్ కృషి చేస్తోందని వెల్లడించారు. 500 కుటుంబాలను కమ్యూనిటీ మిత్రులుగా నియమించి పలు గ్రామాల్లో పబ్లిక్ హెల్త్ డెస్క్ ఏర్పాటుచేసి సేవలందిస్తున్నామని వివరించారు. వనభోజన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి నాగయ్య, పీఐఓ రవితేజ, ఎఫ్‌పీఈఓలు సురేష్, నారాయణరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, శ్రీను, అప్పారావు, చంద్రోశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జియోట్యాగింగ్


తెర్లాంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల ఆధార్ వివరాలు జియోట్యాగ్ చేస్తున్న అధికారులు, సిబ్బంది

తెర్లాం: ప్రభుత్వ పథకాలు నేరుగా వర్తించేలా లబ్ధిదారుల ఆధార్ నంబర్లను జియోట్యాగింగ్ చేసే కార్యక్రమం మండలంలోని అన్ని పంచాయతీల్లో చురుగ్గా జరుగుతోంది. ఎంపీడీఓ రేగి రాంబాబు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు జియోట్యాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి వారి కుటుంబంలో ఉన్న సభ్యుల ఆధార్ నంబర్లను జియోట్యాగ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా పథకాన్ని అమలు చేస్తున్నప్పుడు అర్హులైన వారికి నేరుగా పథకం లబ్ధి వర్తించేలా కుటుంబ వివరాలను, ఆధార్ నంబర్లను నమోదు చేస్తున్నారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ప్రత్యేకాధికారులు పర్యవేక్షిస్తున్నారు.